క్లుప్తంగా

గోసంరక్షణకు విరాళం

కాణిపాకం: కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలోని గోసంరక్షణ ట్రస్టుకు శుక్రవారం దాత రూ.1 లక్ష విరాళం చేశారు. తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాకు చెందిన ప్రసాద్ గోసంరక్షణ ట్రస్టుకు రూ. ఒక లక్ష నగదును విరాళంగా అందించారు. ఆ నగదును అందుకున్న ఆలయ సిబ్బంది వారికి దైవ దర్శనం కల్పించారు. అనంతరం పండితులు ఆశీర్వచనంతోపాటు తీర్థప్రసాదం అందజేశారు.

విద్యార్థి ప్రతిభ


తృతీయ స్థానం సాధించిన ప్రణవ్‌సాయి

చిత్తూరు కలెక్టరేట్: జాతీయ స్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో బృందావన్ సీబీఎస్‌ఈ పాఠశాల విద్యార్థి ప్రణవ్‌సాయి ప్రతిభ చాటి బహుమతి కైవసం చేసుకున్నారు. ఈ నెల 17వ నుంచి 21వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని నర్మదాపురంలో జాతీయ స్థాయి 68వ స్కూల్ గేమ్స్ పోటీలు నిర్వహించారు. అండర్ 19 బాలుర బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొన్న ప్రణవ్‌సాయి రాజస్థాన్‌కు చెందిన విద్యార్థితో తలబడి తృతీయ స్థానం కైవసం చేసుకున్నాడు. ఆ విద్యార్థిని పాఠశాల చైర్మన్ శైలజ కుమారి, డైరెక్టర్ ప్రియతేజ, టీచర్లు అభినందించారు.

పల్లకిలో సత్యసాయి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): సత్యసాయి జయంతిని పురస్కరించుకుని చిత్తూరు నగరంలో శుక్రవారం శ్రీ సత్యసాయి సేవా మందిరం ఆధ్వర్యంలో సత్యసాయి చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. తొలుత మందిరంలో వేద పఠనం చేశారు. అనంతరం పల్లకిలో సత్యసాయి చిత్రపటాన్ని ఊరేగించారు. భజన, మంగళ హారతి మధ్య ఈ ఊరేగింపు సాగింది.

నేడు విద్యుత్ అంతరాయం

చిత్తూరు కార్పొరేషన్: సబ్‌స్టేషన్ నిర్వహణ, విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం సంతపేట సెక్షన్ పరిధిలో విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో అర్బన్ ఈఈ మునిచంద్ర తెలిపారు. సంతపేట, తేనబండ, కొత్తూరు, గంగాకాలనీ, శ్రీనివాసపురం పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు ఈ మార్పును గమనించాలని కోరారు.

అర్ధగిరిలో ఎస్పీ



తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి క్షేత్రాన్ని శనివారం జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్ దర్శించుకున్నారు. అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామిని దర్శించుకోవడానికి విచ్చేసిన ఎస్పీకి అర్చకులు, ఆలయ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామికి అభిషేకం, పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ మండలంలో ఎస్పీకి అర్చకులు శాలువలు కప్పి సత్కరించారు. అక్షింతలు వేసి ఆశీర్వదించి స్వామి వారి తీర్థప్రసాదాలు, చిత్ర పటాన్ని అందజేశారు. ఎస్పీతో పాటు చిత్తూరు రూరల్ సీఐ శ్రీధర్‌నాయుడు, తవణంపల్లె ఎస్‌ఐ చిరంజీవి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నమోదు పరిశీలన

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరంలోని డీసీసీబీ కార్యాలయాన్ని శుక్రవారం జాయింట్ కలెక్టర్ విద్యాధరి సందర్శించారు. కార్యాలయంలో జరుగుతున్న ప్రాథమిక వ్యవసాయ సహకారార సంఘాల రికార్డుల కంప్యూటరీకరణను పరిశీలించారు. ఆపై ఆన్‌లైన్ విధివిధానాలను అడిగి తెలుసుకున్నారు. ఆన్‌లైన్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని వారంలోపు పూర్తి చేయాలని ఆమె అధికారులకు ఆదేశించారు.

నైపుణ్యం అవసరం


వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సీతమ్స్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వెంకటాచలపతి అన్నారు. శుక్రవారం ఆ కళాశాలలో సీఎన్‌సీ వర్క్‌షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంచేందుకు వర్క్‌షాప్‌లు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు. ఈ వర్క్‌షాప్‌లో పలు కళాశాలల నుంచి విద్యార్థులు, అకడమిక్ డీన్ శరవనన్, ఆర్అండ్‌డీ డీన్ సాంబశివరావు, మెకానికల్ హెచ్‌వోడీ సతీష్ పాల్గొన్నారు.

నేడు వర్గీకరణ వ్యతిరేక సభ

బంగారుపాళెం: పలమనేరు పట్టణంలో శనివారం తలపెట్టిన ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక సభను జయప్రదం చేయాలని దళిత నాయకుడు సతీష్, శెల్వకుమార్, దేవయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు జెండామఠం కమ్యూనిటీ హాల్లో జిల్లా మాలమహానాడు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఐకమత్యంతో ఎస్సీ వర్గీకరణను అడ్డుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

మూగ వేదన

ఆస్పత్రి వద్ద కానరాని సిబ్బంది



మూగ జీవుల రోదన ఈ పాలకులకు వినిపించడం లేదు. అనారోగ్యం బారిన పడిన లేగదూడలు వైద్యం అందక మృత్యువాత పడుతున్నాయి. పశువైద్యాధికారి సెలవులో వెళ్లారు. ఆయనతోపాటు సిబ్బందీ అదేబాట పట్టారు. దీంతో పక్క పంచాయతీలోని పశువైద్యాధికారికి బాధ్యతలు అప్పగించారు. ఆయన ఎప్పుడు వస్తారో.. ఆస్పత్రి తాళాలు ఎప్పుడు తీస్తారో ఎవరికీ తెలియదు. దీంతో పాడి రైతులు తమ పశువులను ఆస్పత్రికి తీసుకొచ్చి గంటల తరబడి వేచి చూసి విధిలేక తిరిగి వెళ్లిపోతున్నారు.


ఆస్పత్రి వద్దకు పశువులతో వచ్చి వైద్యుల కోసం ఎదురు చూస్తున్న పాడి రైతులు

- పూతలపట్టు పశువైద్యశాలలో పశువులకు అందని వైద్యం
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- మృత్యువాత పడుతున్న పశువులు

పూతలపట్టు: మండల కేంద్రంలోని పశువైద్యశాలలో మూగజీవాలకు వైద్యం సరిగా అందడం లేదు. డాక్టర్ల కొరత, ఉన్నచోట సరైన సమయానికి రాకపోవడం, సీజనల్ వ్యాధులకు మందులు లేకపోవడంతో మండల కేంద్రంలోని గ్రామాల్లోనున్న పశువులకు వైద్యం కరువైంది. డాక్టర్లు లేక అటెండర్లే పశు వైద్యులుగా అవతారమెత్తుతున్నారు. డాక్టర్లు లేరన్న కారణంతో ఆస్పత్రి తాళమే తీయట్లేదు. రైతులు వైద్యుల కోసం ఎదురుచూసి ఇంటికి తిరిగి వెళ్లిపోతున్నారు. పూతలపట్టు మండల కేంద్రంలోని పశువైద్యశాల కింద రెండు గ్రామీణ పశువైద్యకేంద్రాలు (వెటర్నరీ డిస్పెన్సర్) ఉన్నాయి. వాటి కింద 8 రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో మండలం మొత్తం 19 మంది సిబ్బంది ఉన్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాల కింద పెనుమూరుకు చెందిన సాతంబాకం, పెనుమూరు గ్రామీణ పశువైద్యకేంద్రాలు పని చేస్తున్నాయి.

ఆస్పత్రిలో ఒకే ఒక్కడు

మండల కేంద్రంలోని పశువైద్యశాలలో ఇద్దరు వైద్యులు, ఒక డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉన్నారు. ఏడీగా విధులు నిర్వర్తిస్తున్న వైద్యాధికారి సెలవులో వెళ్లగా, ఎల్ఎస్ఏగా విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది వారం రోజులు సెలవు మీద వెళ్లారు. వీరు వెళ్లి 16 రోజుల పైనే అయిందని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం వైద్యశాలలో ఒకే ఒక్క డేటా ఎంట్రీ ఆపరేటర్ మాత్రమే విధులకు హాజరవుతున్నారు. ఏడీ స్థానంలో తలపులపల్లె డాక్టర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. అయితే మందులు నిల్వ ఉన్న గది తాళం ఏడీ దగ్గరే ఉండిపోయింది. దీంతో ప్రస్తుతం పశువులకు ఎలాంటి వైద్య సేవలు అందడం లేదు.

ఎదురు చూస్తున్న రైతులు

సాధారణంగా పశువైద్యశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు వైద్యులు రైతులకు అందుబాటులో ఉండాలి. కానీ ఇక్కడ ఐదు రోజుల నుంచి ఉదయం 11 గంటలైనా ఆస్పత్రి తలుపులు తెరవడం లేదు. మండల కేంద్రంలోని సామినత్తం, అనంతాపురం, బత్తలవారిపల్లి, పోలవరం, పంటపల్లె తదితర గ్రామాల్లోని సుమారు 3 కిలోమీటర్ల దూరం నుంచి పాడి రైతులు ఇక్కడికి రావడం నిరీక్షించడం వెళ్లిపోవడం ఈ తంతు రోజు సాగుతోంది. దీంతోపాటు శువైదశాల ఆవరణలో వాడేసిన సిరంజ్‌లు, ప్లాస్టిక్ కవర్లు, ఎక్కడ చూసినా కలుపు మొక్కలతో నిండిపోయింది. వైద్యశాల ఆవరణ మొత్తం డంపింగ్ యార్డులా ఉంది.

మండలంలో జీవాలు	సంఖ్య
ఆవులు	1250
మేకలు	384
గొర్రెలు	595

సమస్యను పరిష్కరిస్తాం

రైతుల వద్ద నుంచి వచ్చిన సమస్యను పరిష్కరిస్తాం. వైద్యాధికారి, సిబ్బంది సెలవులో ఉండడంతో ఇన్‌చార్జ్ బాధ్యతలు వేరేవాళ్లకు అప్పగించాం. వేరే ప్రాంతంలో పనిచేస్తున్న డాక్టర్ రోజు మార్చి రోజు ఇక్కడ పనిచేయడానికి ఆదేశాలు ఇచ్చాం. జిల్లా కేంద్రానికి మందుల వచ్చాయి. రెండు రోజుల్లో అన్ని ఆస్పత్రులకు పంపిణీ చేస్తాం. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

–గోవిందయ్య, డిప్యూటీ డైరెక్టర్, పుత్తూరు డివిజన్, పశుసంవర్ధశాఖ

ఆస్పత్రి గదిలో ఉన్న అరకొర మందులు



మూడు దూడలు చనిపోయాయి



నాకు ఐదు దూడలు ఉన్నాయి. అందులో మూడు దూడలకు ఒంటిపైన బొబ్బలు రావడంతో పశువైద్యశాలకు తీసుకెళ్లాను. సిబ్బంది చికిత్సలు చేశారు. అయినా ఆ బొబ్బలు తగ్గడం లేదు. అలా తగ్గకపోగా వాటిలో మూడు దూడలు చనిపోయాయి. వైద్యులను అడిగితే సరైన సమయంలో టీకాలు వేసుకోలేదని చెబుతున్నారు.

– సుబ్రమణ్యం, పాడి రైతు, పూతలపట్టు

ఆలస్యంగా వస్తున్నారు



మండల కేంద్రంలోని పశువైద్యశాలలో వైద్యుల ఆలస్యంగా వస్తున్నారు. ఉదయం 10.30 గంటలైనా ఆస్పత్రి తలుపు తాళం వేసి వుంటుంది. మేము పశువులతో పాటు ఆస్పత్రి వద్ద ఎదురుచూసి, వైద్యులు రాకపోవడంతో చాలా సార్లు ఇంటికి తిరిగి వచ్చేసిన రోజులు ఉన్నాయి. అధికారులు స్పందించి మంచి వైద్యులను కేటాయించండి

– రెడ్డెప్ప, పాడి రైతు, పూతలపట్టు

మందులు లేవు



పూతలపట్టు వైద్యశాలలో సరైన మందులు లేవు. మందులు లేక మేము నానా ఇబ్బందులు పడుతున్నాం. ఆస్పత్రికి వెళితే మందులు లేకుండా బయట పట్టణాల్లోని తీసుకొస్తే పశువులకు చికిత్సలు చేస్తున్నారు. మా వద్ద నున్న డబ్బు లున్నాయి. మేము కొనుక్కొచ్చి వైద్యం చేయించుకుంటాం. లేని వారి పరిస్థితేంటి? అధికారులు స్పందించి మందులను వైద్యశాలకు తెప్పించాలని కోరుకుంటున్నాను.

– చిన్నబ్బు, పాడిరైతు, పూతలపట్టు

పంజా విసురుతున్న చలిపులి

ఐరాల: మండలంలో చలి తీవ్రత పెరుగుతోంది. మూడు రోజులుగా ఉదయం చలి గాలులు వీస్తుండడం, రాత్రి పూట ఉష్ణోగ్రతలు పడిపోవడంతో మండలవాసులు గజగజ వణుకుతున్నారు. పిల్లలు చలి బారిన పడకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. తెల్లవారుజామున చలితీవ్రత మరింత అధికంగా ఉంది. దీంతో పాటు మంచు కురవడంతో ఉదయం పూట వాహనాలు లైట్‌లు వేసుకుని వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

జాగ్రత్తలు పాటించాలి

రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పడిపోతున్నందున వ్యాధులు దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఉదయాన్నే గోరువెచ్చని నీటిని తీసుకోవాలని, చలిలో తిరగాల్సి వస్తే చెవులు, ముక్కుకు చల్ల గాలి తగలకుండా ఉన్ని దుస్తులు, క్యాప్ లాంటివి ధరించాలి. వేడిగా ఉన్న ఆహార పదార్థాలనే భుజించాలి. శీతలపానీయాలు, ఐస్‌క్రీంలు, ఇతర చల్లటి తినుబండారాలకు దూరంగా ఉండడం మేలు. చిన్నారుల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలి. ప్రయాణించే సమయంలో, రాత్రి పూట చిన్నారులకు దుస్తులను పూర్తిగా కప్పేసి ఉంచాలి. ఆస్తమా వ్యాధిగ్రస్తులు ఆయాసం రాకుండా మందులు వేసుకోవాలి. అత్యవసరంగా బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు మాస్క్‌లు ధరించాలి. చలి కాలంలో శరీరం పొడిబారకుండా నువ్వుల నూనెను స్నానానికి ముందు ఒంటికి రాసుకుంటే మెరుగైన ఫలితాలు ఉంటాయి.

ఐపీపీబీలో చురుగ్గా ఎన్‌పీసీఐ అనుసంధాన ప్రక్రియ

చిత్తూరు కార్పొరేషన్: ఇండియన్ పోస్ట్ పేమెంట్స్ బ్యాంక్ (ఐపీపీబీ)లో ఎన్‌పీసీఐ అనుసంధాన ప్రక్రియ చురుగ్గా చేస్తున్నట్టు తపాలాశాఖ సూపరింటెండెంట్ లక్ష్మణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చాలామందికి బ్యాంకు ఖాతా ఉన్నప్పటికీ ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకోలేదని పేర్కొన్నారు. వారు సంబంధిత తపాలా కార్యాలయాల్లో సంప్రదించి ఐపీపీబీ ఖాతాను ప్రారంభించాలని వెల్లడించారు. ఇటీవల విజయవాడ వరదల్లో నష్టపోయిన బాధితుల బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ లింక్ లేకపోవడంతో పరిహారం జమకాలేదని తెలిపారు. ఇదే విషయాన్ని ప్రభుత్వం గమనించి బ్యాంకు ఖాతాకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసుకునేలాలా చర్యలు తీసుకుందని వివరించారు.

సస్యరక్షణ పద్ధతులు పాటిస్తేనే దిగుబడి


మాట్లాడుతున్న జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్‌రెడ్డి


హాజరైన మామిడి రైతులు

- జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్‌రెడ్డి

ఐరాల: మామిడిలో పూత, పిందె దశలో సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాంపల్లె ఎన్‌పీ సావిత్రమ్మ కల్యాణ మండపంలో శుక్రవారం మండలంలోని మామిడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నవంబర్ నుంచి జనవరి వరకు కొమ్మ కత్తిరింపులు, దున్నడం లాంటివి చేయకుండా మామిడి చెట్లకు విశ్రాంతి ఇవ్వాలన్నారు. ఆ సమయంలో చెట్టుకు అంతరాయం కలిగిస్తే పూత రావడం ఆలస్యం కావడం లేదా పూత రాకుండా ఉండడమే కాకుండా దిగుబడులు తగ్గే అవకాశం ఉంటుందని చెప్పారు. మామిడిలో ప్రధాన సమస్యలైన తేనేమంచు, తామర, పండు ఈగ, అంత్రాక్నోస్, బూడిద తెగులు నివారణకు చేపటాల్సిన యాజమాన్యం, వినియోగించాల్సిన మందులు, అదేవిధంగా మామిడిలో విడతల వారీగా పిచికారీ చేయవల్సిన మందుల గురించి రైతులకు వివరించారు. మండలంలో మామిడి రైతులను ప్రధానంగా ఇబ్బందికి గురిచేస్తున్న తేనే మంచు పురుగు ఉధృతి నివారణకు బప్రోఫైజిన్ 25 ఈసీ మందు లీటరు నీటికి 1.5 ఎం.ఎల్ లేదా బప్రోఫైజిన్ 20ఈసీ+ ఎసిఫేట్ 50 శాతం డబ్ల్యూపీ మందు 1 గ్రాము లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అంత్రాక్నోస్ తెగులు నివారణకు థయోఫినేట్ మిథైల్ 70 శాతం డబ్ల్యూపీ మందు 1 గ్రాము లీటరు నీటిలో లేదా అజాక్సీస్ట్రోబిన్ 23 శాతం ఎస్సీ మందు 1 ఎం.ఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని వివరించారు. మామిడిలో కవర్లు కట్టడం ద్వారా వచ్చే పంట నాణ్యత కల్గి మంచి దిగుబడితో పాటు మార్కెట్‌లో అధిక ధర పలుకుతుందని చెప్పారు. రైతులు ఈ పద్ధతిని అవలంభించాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖాధికారిణి సాగరిక, ఏట వరలక్ష్మి, ఎంపీఈఓ త్రివేణి, వీహెచ్ఏలు రామచైతన్య, మురళీకృష్ణ, కావేరి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై నీలినీడలు

- యథేచ్ఛగా పాలిథిన్ కవర్ల వినియోగం
- ఎక్కడ చూసినా దర్శనమిస్తున్న వైనం
- పర్యావరణానికి పొంచి ఉన్న ముప్పు


రోడ్డు పక్కన పడేసిన పాలిథిన్ వ్యర్థాలు

బంగారుపాళెం: జీవకోటి మనుగడకు ముప్పు తెచ్చే ప్లాస్టిక్‌ను నిషేధించినా అది కాగితాల మాత్రమే పరిమితమైంది. ప్రస్తుతం మండలంలో పాలిథిన్ కవర్ల వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. గతంలో అధికారులు చర్యలు చేపట్టినప్పటికీ కథ మళ్లీ మొదటికొచ్చింది. ప్లాస్టిక్ నిషేధం ప్రస్తుతం ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. ప్లాస్టిక్ సంచులను మార్కెట్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. వాటి వినియోగం పర్యావరణ పరిరక్షణకు పెనుభూతంగా మారింది. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకూ మనం చేసే ప్రతి పనిలోనూ పాలిథిన్ వినియోగం ఉంటోంది. ఉదయం బయట నుంచి టిఫిన్, కూరగాయలు తేవాలన్నా, ఇంటి సరకులు తీసుకువెళ్లాలన్నా అన్నింటికీ పాలిథిన్ కవర్లనే వాడుతున్నాం. వాటి వల్ల పర్యావరణానికి ముప్పు అని తెలిసినా మానడం లేదు. పాలిథిన్ కవర్ల వాడకాన్ని ప్రభుత్వం నిషేధించినా ఎక్కడా అమలు కావడం లేదు. అప్పుడప్పుడూ అధికారులు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

నియోజకవర్గంలో టన్ను వ్యర్థాలు



పాలిథిన్ కవర్లు, వస్తువుల విక్రయాలు నియోజకవర్గంలో అన్ని మండలాల్లో యథేచ్ఛగా సాగుతున్నాయి. నియోజకవర్గంలో రోజుకు సుమారు టన్ను వరకూ ప్లాస్టిక్ వ్యర్థాలు బయటపడుతున్నట్లు అంచనా. గతంలో 40 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన పాలిథిన్ కవర్ల విక్రయాలపై గ్రామ స్థాయి నుంచి నిషేధాన్ని అమలు చేశారు. వాటిని విక్రయించే వ్యాపారులకు అధికారులు నోటీసులు జారీ చేసి జరిమానాలు విధించారు. దీంతో వాటి వినియోగం అప్పట్లో చాలా వరకూ తగ్గింది. ఈ హడావుడి మూణ్నాళ్ల ముచ్చటగా మారింది. ఆ తరువాత అధికారులు పట్టించుకోకపోవడంతో క్రమం క్రమంగా ప్లాస్టిక్ కవర్లు, వస్తువుల వినియోగం ఎక్కువైంది. దుకాణాలు, బేకరీలు, హోటళ్లు, కర్రీపాయింట్లలోను, విందుల్లోను, చికెన్ సెంటర్ల వద్ద పాలిథిన్ వాడకాలు విచ్చల విడిగా దర్శనమిస్తున్నాయి. వాటిని రోడ్లపైన, గ్రామ పరిసర ప్రాంతాల్లో, మురుగునీటి కాలువల్లో పడేస్తున్నారు. వీటి వల్ల అపరిశుభ్ర వాతావరణం నెలకొంటోంది.

క్యాన్సర్ వచ్చే ప్రమాదం

వేడి ఆహార పదార్థాలను(ఫాస్ట్‌ఫుడ్) ప్లాస్టిక్ సంచుల్లో తీసుకుని వెళ్లడం వల్ల పాలీ ఇథలిన్, పాలీ హిస్టరీస్ వంటి రసాయనాలు ఆహారపదార్థాల్లో కలసి పోతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. దీని ద్వారా క్యాన్సర్ తదితర వ్యాధులు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గతంలో బంగారుపాళెంలో ఓ రైతుకు చెందిన పాడిపశువు పాలిథిన్ కవర్లు తిని అనారోగ్యానికి గురి కావడంతో మృతి చెందింది. దీంతోపాటు పలు మేకలు మృతి చెందాయని రైతులు వాపోయారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లే పాలిథిన్ విక్రయాలపై అధికారులు తనిఖీలు చేపట్టాలని, వాటిని అమ్మేవారిపైనే కాకుండా తయారీ సంస్థలపై కూడా దృష్టి సారించాలని, అప్పుడే నిషేధం సక్రమంగా అమలవుతుందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.


మురుగు కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను తీస్తున్న కార్మికుడు

నిషేధాన్ని అమలు చేయాలి

పాలిథిన్ నిషేధాన్ని పక్కాగా అమలు చేయాలి. వీటిని విక్రయించే వారిపైన చర్యలు తీసుకోవాలి. పాలిథిన్ కవర్ల వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతోంది. వాటిని వినియోగించకుండా ప్రజల్లో చైతన్యం కలిగించాలి. 40 మైక్రాన్ల కన్నా తక్కువ మందం కలిగిన కవర్లను తయారు చేస్తున్న వారిపైన చర్యలు తీసుకోవాలి.

– రఘు, తగ్గువారిపల్లె

చర్యలు తీసుకుంటాం

మండలంలోని అన్ని గ్రామాల్లో పాలిథిన్ కవర్లు విక్రయించే దుకాణదారులపై చర్యలు తీసుకుంటాం. ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల స్థానంలో ప్రత్యామ్నాయంగా కాగితం, గుడ్డ సంచులు వాడాలని ప్రజలకు అవగాహన కల్పిస్తాం. పర్యావరణానికి హాని కలిగించే వాటిపై ప్రజలు చైతన్యం కావాల్సిన అవసరం ఉంది.

–శ్రీధర్ ఇన్‌చార్జి ఎంపీడీఓ, బంగారుపాళెం

పన్ను వసూళ్లపై శ్రద్ధ చూపాలి


మాట్లాడుతున్న కమిషనర్ నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్: ఆస్తిపన్నును వసూలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండొద్దని, శ్రద్ధ చూపించి సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. అనంతపురం నుంచి రీజనల్ డైరెక్టర్ విశ్వనాథ్ శుక్రవారం జిల్లాలోని మునిసిపల్ కమిషనర్లతో వీడియో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనంతరం చిత్తూరు కార్పొరేషన్ కార్యాలయం నుంచి కమిషనర్ ఇక్కడి అధికారులతో సమీక్షించారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న బకాయిల జాబితా సిద్ధం చేయాలని చెప్పారు. రానున్న 120 రోజులు పన్నుల వసూళ్లకు ఎంతో కీలకమని వివరించారు. వాణిజ్య సముదాయాలు, లాడ్జీలు, కల్యాణ మండపాల నుంచి వెంటనే బకాయిలు రాబట్టాలన్నారు. సమావేశంలో సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజినీరు వెంకటరామిరెడ్డి, రెవెన్యూ అధికారి వర్మ, ఉమామహేశ్వర్ పాల్గొన్నారు.

282 విద్యుత్ కేసులు నమోదు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో గురువారం రాత్రి ట్రాన్స్‌కో 3 డివిజన్ల పరిధిలోని విద్యుత్ సర్వీసులను సిబ్బంది తనిఖీ చేశారు. మొత్తం 1,438 సర్వీసులను తనిఖీ చేయగా, చిత్తూరు అర్బన్ డివిజన్ 78, చిత్తూరు రూరల్ 82, పుంగనూరు 122 కేసుల చొప్పున 282 కేసులు నమోదు చేశారు. వీటికి సంబంధించి రూ.5.29 లక్షలు చెల్లించాలని వినియోగదారులకు నోటీసులు అందజేశామని ట్రాన్స్‌కో ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ వెల్లడించారు.